## ఒమన్‌లో ధర్పల్లివాసి మృతి

ధర్పల్లి, జూన్ 27 : మండల కేంద్రానికి చెందిన పర్కిట్ నరేందర్ (రాము) (38) గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందా డు. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం ఒమన్‌కు వెళ్లిన నరేంద ర్, ఇటీవల సెలవుపై వచ్చి నాలుగు నెలల క్రితం తిరిగి వెళ్లాడు. గత బుధవారం మధ్యాహ్నం సల అనే ప్రాంతంలో రోడ్డు పక్కన స్నేహితుడి కోసం వేచి ఉండగా ఓ కారు అదుపు తప్పి నరేందర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విష యం తెలుసుకున్న మస్కట్‌లో ఉంటున్న అతని ఇద్దరి సోదరులు, మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. మృతుడికి భార్య గౌరి, కూతురు కుమారుడు ఉన్నారు.

**బహ్రెయిన్‌లో కేకే తండావాసి..**

ఇందల్వాయి, జూన్ 27 : మండలంలోని కేకే తండాకు చెందిన బాదావత్ రాజు (30) బహ్రెయిన్‌లో మున్సిపాలిటీలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రక్కు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాజు స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కుటుంబసభ్యులు కోరుతున్నారు. రాజు రెండేండ్ల క్రితం స్వగ్రామానికి వచ్చిన తిరిగి బహ్రెయిన్ వెళ్లాడు.

## కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి, జూన్ 27 : జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన మార్గం గౌతమి (25) కడుపునొప్పి భరించలేక గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు ఉన్నాడు. సంఘటనా స్థలాన్ని జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, తహసీల్దార్ సందర్శించి పంచనామా నిర్వహించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## చెట్ల పొదల్లో కుళ్లిన మృతదేహం లభ్యం

వినాయక్‌నగర్, జూన్ 27: నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని మిట్టపూర్ గ్రామ శివారులో చెట్ల పొదల్లో కుళ్లిపోయిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తమకు సమాచారం అందించారని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. 55 ఏండ్ల వయస్సు ఉన్న వ్యక్తి నడుస్తున్న రైలులోంచి ప్రమాదవశాత్తు పడి మరణించి ఉంటాడని పేర్కొన్నారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు తెలియరాలేదని, శవంపై తెలుపు రంగు పుల్‌షర్ట్, ధోతి ధరించినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 87126-58591 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

## అక్రమ కట్టడాలపై బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సారంగాపూర్, జూన్ 27 : నగర శివారులోని 13వ డివిజన్ డెయిరీ ఫారం వద్ద 249 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరూ కబ్జా చేసి కేటాయించిన ప్లాట్లలో అక్రమంగా చేపట్టిన ఇండ్ల నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు అక్బర్ నవాజుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అప్సర్, రాజు, వాహిద్ అలీ, గులాబ్‌సింగ్, హరి తదితరులున్నారు.

# అన్ని గ్రామాల్లో 'ప్లాస్టిక్ రీసైక్లింగ్' చేయాలి

**డీఎల్‌పీవో శ్రీనివాస్**

ధర్పల్లి, జూన్ 27: అన్ని గ్రామాల్లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. గురవారం ఆయన మండల కేంద్రంలోని జీపీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ యంత్రాన్ని పరిశీలించారు. అంతకుముందు ఆయన సీతాయిపేట్ గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేసిన అనంతరం ఎంపీడీవో బాలకృష్ణతో కలిసి ధర్పల్లి జీపీలో కొనసాగుతున్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ యంత్రాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ యంత్రాన్ని ఉపయోగించడం అభినందనీయమని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సైపుద్దీన్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

**అమ్మ ఆదర్శ పాఠశాలల తనిఖీ**

మండలంలోని బెలియతండా, మరియతండా పాఠశాలల్లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమైనందున త్వరితగతిన మిగతా పనులను పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.



ధర్పల్లిలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

## 'ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తే బుద్ధి చెబుతాం'

సిరికొండ,జూన్ 27: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా విశ్రాంతి భవనం కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమిస్తే బుద్ధిచెబుతామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్ అన్నారు.గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విశ్రాంతి భవనం కోసం కేటాయించిన భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయాలని మాస్టర్ ప్లాన్ వేశారని ఆరోపించారు. పదేండ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో మౌనంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ కబ్జా చేయడానికి ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో గుర్తించి కబ్జాకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే భూపతిరెడ్డి వెంటనే స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

## వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం

కోటగిరి, జూన్ 27: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తర్ణ అధికారి గోవర్ధన్ అన్నారు. గురువారం కోటగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తాగునీటి సరఫరా, ట్యాంకును పరిశీలించారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, ఏఎన్ఎం రోజా, శ్రీదేవి, ప్రమీల, కేజీబీవీ ఉపాధ్యాయురాలు రూప, ఆశ కార్యకర్తలు అక్తరి, సంగీత, అనిత తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

భీమ్‌గల్/వర్ని, జూన్ 27: నూతన జాతీయ విద్యావిధానం(రివైజ్డ్ ప్రీ స్కూల్)పై భీమ్‌గల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు 3వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్‌బీ హాజరై మాట్లాడారు. ప్రీ స్కూల్ పిల్లల ఫోర్ట్ పోలియో ప్రతి సెంటర్‌లో ఏర్పాటు చేయాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో రసూల్‌బీ

**వర్ని మండల కేంద్రంలో..**

వర్ని మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు 'చిన్నారుల పెంపకంలో మెళకువలు- తీసుకోవాల్సిన జాగ్రత్తలు'పై గురువారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ తరగతులను ఎంపీడీవో వెంకటేశ్వర్ ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు వీడియోల ద్వారా శిక్షణ తరగతులు కొనసాగించారు. కార్యక్రమంలో సీడీపీవో జానకమ్మ, సూపర్‌వైజర్లు మమత, వనజ, మణి, వర్ని, మోస్రా, కోటగిరి మండలాలకు చెందిన టీచర్లు పాల్గొన్నారు.

## మాటు కాలువ కబ్జా తొలగింపు



తొలగింపు పనులను పరిశీలిస్తున్న అధికారులు

ధర్పల్లి, జూన్ 27 : మండల కేంద్రంలోని పెద్దచెరువులోకి వరద వచ్చే మాటుకాలువ కబ్జాను అధికారులు పోలీసుల సహాయంతో గురువారం తొలగించారు. మండలంలోని మద్దుల్ అటవీ ప్రాంతంలో ప్రభుత్వ సర్వే నంబర్ 822 వద్ద మాటు కాలువ గట్టును రైతు చదును చేయడంతో గండి పడి కింద ఉన్న పొలాల్లోకి నీరు వచ్చి చేరింది. దీనిపై పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ రాంప్రసాద్, ఆర్ఐ రవి, ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై విక్రమ్ బందోబస్తు మధ్య మాటు కాలువ కబ్జాను తొలగించి గండిని పూడ్చివేశారు.

**బాధ్యతల స్వీకరణ**

ఖలీల్‌వాడి, జూన్ 27: నీటిపారుదల శాఖ సర్కిల్ ఎస్ఈ కార్యాలయం సూపరింటెండెంట్‌గా గైని గంగారాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు డీఈఈ బీమ్యానాయక్‌ను కలిసి ఆయన జాయినింగ్ లెటర్ అందజేశారు. గైని గంగారాంను వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## 'ఆ భూమికి రక్షణ కల్పించాలి'

మోర్తాడ్, జూన్ 27: వేల్పూర్ మండలం మోతెలో మాదిగ కుటుంబానికి చెందిన పట్టాభూమికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులుకు గురువారం కమ్మర్‌పల్లి దళిత సంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. మాదిగ కుటుంబానికి చెందిన భూమిని మోతె గ్రామాభివృద్ధి కమిటీ కబ్జా చేసి, ఆ కుటుంబంపై దాడి చేసి గ్రామ బహిష్కరణ చేశారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో దళితసంఘం నాయకులు క్రాంతికుమార్, అశోక్, రాజు, పృథ్వీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 'వారంలో స్పందించకుంటే నిరాహార దీక్ష'

ఆర్మూర్‌టౌన్, జూన్27: సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఉత్తర తెలంగాణపై వివక్ష చూపితే సహించేదిలేదని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి విమర్శలు చేశారు. ఆర్మూర్‌లో పైలట్ ప్రాజెక్టు కింద ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ నిర్మించాలని గతంలో తాను సీఎంను కోరానని, ఇప్పటి వరకూ సానుకూల ప్రకటన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారంలో ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని సామాజిక వేదిక నుంచి ప్రకటించారు. ఉన్నత పదవుల్లో ఉన్న సీఎం, ఉప ముఖ్యమంత్రి వారి నియోజకవర్గాలకే న్యాయం చేసుకుంటుంటే ఇతర ప్రాంతాలకు ఎప్పుడు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రాంతాల మధ్య విభేదాలు చూపకుండా సమ న్యాయం పాటించాలని ఎమ్మెల్యే కోరారు.

## 150 కిలోల ప్లాస్టిక్ కవర్లు సీజ్



దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న ఇంజినీర్ పూర్ణమౌళి

ఆర్మూర్‌టౌన్, జూన్27: పట్టణంలోని మామిడిపల్లిలో ఉన్న రాందేవ్ ప్లాస్టిక్ దుకాణంలో గురువారం పర్యావరణ ఇంజినీర్ రాజమౌళి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాందేవ్ ప్లాస్టిక్ దుకాణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్నారన్న సమాచారంతో తనిఖీ చేశామని అన్నారు. 150 కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత ఆర్మూర్‌గా మార్చేందుకు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రవి, అక్షయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

వినాయక్‌నగర్, జూన్ 27: నిజామాబాద్ మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ ఫోన్లను గుర్తించి బాధితులకు గురువారం అందించినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## చారిత్రాక అంశాలపై అవగాహన కల్పించాలి

సుభాష్‌నగర్,జూన్27:ఇందూరు ఉమ్మడి జిల్లాలో అనేక చారిత్రక అంశాలు మరగున పడి ఉన్నాయని, చారిత్రాక అంశాలను వెలికి తీసి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఓయూ విశ్రాంత రిజిస్ట్రార్, ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కిషన్‌రావు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో బుధవారం రాత్రి జిల్లా ఇతిహాస సంకలన సమితి కార్యవర్గాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు. చరిత్ర అధ్యయనం జరగకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఇతిహాస సంకలన సమితి అధ్యక్షుడిగా ఆచార్య కల్వకోట నరేశ్ కుమార్, కార్యదక్షుడిగా సీహెచ్ మోహన్ దాస్, ఉపాధ్యక్షురాలిగా శైలి బెలాల్, ప్రధాన కార్యదర్శిగా కందకుర్తి ఆనంద్, కోశాధికారిగా బి. సాయిరెడ్డి, మహిళా కార్యదర్శిగా రాధా, ఈసీ మెంబర్‌గా వెంకటమల్లయ్య, జి. నవీన్, నల్లూరి సురేశ్, వి. దయానంద్, జయకృష్ణ, నిఖిలేష్, ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకొన్నారు.

## ఎంపీ ఓవైసీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

ఆర్మూర్‌టౌన్,జూన్27: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ జై పాలస్తీనా అంటూ చేసిన నినాదాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. వెంటనే ఓవైసీని ఎంపీ పదవికి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కలిగోట గంగాధర్, ఆకుల శీను, కలిగోట ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి చికిత్సా శిబిరం

శక్కర్‌నగర్, జూన్ 27: బోధన్ పట్టణంలోని రాకాసీపేట కంటి దవాఖాన కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం నుంచి ఆక్యుప్రెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్ చికిత్సా శిబిరం ప్రారంభించనున్నట్లు ప్రోగ్రాం చైర్మన్, లయన్ యార్లగడ్డ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం కంటి దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నేచర్ క్యూర్ పద్ధతిలో వివిధ వ్యాధులకు చికిత్సలు నిర్వహిస్తారని అన్నారు. ఈ శిబిరం జూలై 3వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. వివరాలకు లయన్ లంక రవి 9989137137ని సంప్రదించాలని తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

- **12 తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాలు, రూ. 40వేలు నగదు అపహరణ**

శక్కర్‌నగర్, జూన్ 27: బోధన్ పట్టణ శివారులోని ఆచన్‌పల్లిలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు.. పట్టణ సీఐ సంద్ర వీరయ్య కథనం మేరకు.. ఆచన్‌పల్లిలో నివాసం ఉంటున్న సోమ నాగచంద్రారెడ్డి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతని తల్లి మే 23న ఇంటికి తాళం వేసి కుమారుడి వద్దకు వెళ్లింది. బుధవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువా తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో సీసీ ఫుటేజీలు పరిశీలించగా ఈనెల18న రాత్రి 12.50గంటలకు చోరీ జరిగినట్లు తేలింది. ముగ్గురు వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. 12 తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాలతోపాటు, రూ.40వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు నాగచంద్రారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి

ఎడపల్లి, జూన్ 27: చెరువులో చేపల వేటకువెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి అంబం గ్రామానికి చెందిన ఒకరు గురువారం మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. అంబం గ్రామానికి చెందిన రఘుపతి శ్రీనివాస్ (35) గ్రామంలోని చెరువులో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు చేపలు పడుతున్నాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి వలలో చిక్కుకుని మృతి చెందాడు. తోటి కులస్తులు ఆయనను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## కమ్మర్‌పల్లిలో తైబజార్ వేలం వాయిదా

మోర్తాడ్, జూన్ 27: కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో రాజశ్రీనివాస్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి గాను తైబజార్ వేలం నిర్వహించారు. డిపాజిట్ దారులు నలుగురు వేలంలో పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర వేలంలో రాకపోవడంతో శుక్రవారానికి వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో, కార్యదర్శి శాంతికుమార్ ప్రకటించారు.

## రేపు రెండు బైక్‌ల వేలం

మోర్తాడ్, జూన్ 27: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు టన్వాల్ ఎలక్ట్రికల్ బైక్‌లకు ఈనెల 29న మోర్తాడ్ ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ గుండప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే వారు 25 శాతం ఈఎండీ చెల్లించాలని కోరారు.

## అక్రమాలపై విచారణ జరిపించాలి

ఆర్మూర్‌టౌన్, జూన్27: స్థానిక మున్సిపల్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్‌లో ఇష్టానుసారంగా ఇంటి నంబర్లు కేటాయించడం, చెత్తబండ్ల కొనుగోలు వంటి వాటిపై అక్రమాలు జరిగాయని అన్నారు. కలెక్టర్ స్పందించి జిల్లాస్థాయి అధికారులు విచారణ చేయించాలని కోరారు.

## బాధితులకు న్యాయం చేయాలి

ఆర్మూర్‌టౌన్, జూన్27: నందిపేట్ మండలానికి చెందిన కొందరి ఇండ్ల పట్టాలను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మూగ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం బాధితులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 2004లో అప్పటి ప్రభుత్వం అసైన్‌మెంట్ ఇండ్ల పట్టాలను పంపిణీ చేసిందని అన్నారు. ఇప్పుడు లబ్ధిదారుల స్థలాలను కొందరు కబ్జా చేశారని అన్నారు. బాధితులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS

★Wanted Teachers to Teach Telugu, Hindi, English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant, Little Heart High School, Namdevwada, Nzb. Nursery to X Std. Contact No. 8309582476

NTZ-324943

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## 'చెరువు తూము మరమ్మతులు చేపడుతాం..'



చెరువు తూమును పరిశీలిస్తున్న రైతులు, కాంట్రాక్టర్

బోధన్ రూరల్, జూన్ 27: రెండు, మూడు రోజుల్లో చెరువు తూము మరమ్మతు పనులు చేపడుతామని కాంట్రాక్టర్ చెప్పారని గ్రామస్తులు పేర్కొన్నారు. బోధన్ మండలంలోని ఊట్‌పల్లి ఊర చెరువు అలుగు తూము మరమ్మతు చేయాలని కోరుతూ వారం రోజుల క్రితం గ్రామస్తులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గురువారం సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌ను పంపించారు. కాంట్రాక్టర్ గ్రామస్తులతో కలిసి అలుగు తూమును పరిశీలించారు. గ్రామస్తులు టప్ప సాయిలు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రగతి చక్రం అవార్డ్స్ అందజేత



వ్యాసరచన పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న డీఎం, ఎంవీఐ

బోధన్, జూన్ 27: బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం 'ప్రగతి చక్రం' అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విధుల్లో ప్రతిభ చూపిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉద్యోగుల పిల్లలకు 'లక్ష్యే లక్ష్యం' ఛాలెంజ్‌లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి బోధన్ ఎంవీఐ శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

- **సహజ యోగ ధ్యాన శిబిరం :** ఖలీల్‌వాడి, జూన్ 27: నగరంలోని విజయ్ హైస్కూల్‌లో శ్రీ మాతాజీ నిర్మలాదేవి అనుచరులు గురువారం సహజయోగ ధ్యాన శిక్షణ శిబిరం నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. ధ్యానం ద్వారా మానసిక ఒత్తిడిని తొలగించవచ్చని, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మనోధైర్యం మెరుగుపడి వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని విద్యార్థులకు సూచించారు. క్రమం తప్పకుండా ధ్యానం చేయడంతో చెడు అలవాట్లకు దూరం కావచ్చన్నారు. శిబిరంలో అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపాల్ విజేత, విద్యార్థులు పాల్గొన్నారు.
- **కస్తూర్బా లో హెడ్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు:** డిచ్‌పల్లి, జూన్ 27 : డిచ్‌పల్లి కసూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హెడ్‌కుక్ -1, అసిస్టెంట్ కుక్ -2 పోస్టుల భర్తీకి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ సవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి ఉండాలని, దరఖాస్తులను ఈనెల 28 నుంచి జూలై 7 వరకు అందజేయాలని సూచించారు.
- **భూములు కబ్జా కాకుండా కాపాడాలని వినతి:** డిచ్‌పల్లి, జూన్ 27 : తమ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు వారు ఏఐకేఎంఎస్, పీవైఎల్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సుప్రియ, సాయిలు, లక్ష్మి, గంగామణి, చిన్న ఒడ్డెన్న, సావిత్రి, రాజమణి, శాంత, పోసాని, కర్రెవ్వ, పోసాని పాల్గొన్నారు.
- **టీయూలో సెంట్రల్ యూనివర్సిటీ వీసీ దిష్టిబొమ్మ దహనం:** డిచ్‌పల్లి, జూన్ 27 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్, మాజీ విద్యార్థి సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులను క్యాంపస్ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ యూనివర్సిటీలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. ఐదుగురిపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు దినేశ్, చిత్రు, అరవింద్, కృష్ణ, రాకేశ్, రోషన్ పాల్గొన్నారు.
- **ఆహారంతోనే ఆరోగ్యం:** డిచ్‌పల్లి, జూన్ 27 : టీయూలోని కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా ప్రయోజనాలు పాటించాల్సిన విధానాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పుణేకు చెందిన మాతాజీ నిర్మలాదేవి సహజ యోగ గురువు పూజ్యశ్రీ కరణ్ మాట్లాడుతూ.. ఆహారంతోనే ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఆహారమే ఔషధంగా మార్చుకోవాలని అందుకు ప్రకృతిలో లభ్యమయ్యే పచ్చి ఆహారం తీసుకోవాలన్నారు. మాంసాహారానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్.ఆరతి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.
- **బాధితుడికి బాజిరెడ్డి పరామర్శ:** ఇందల్వాయి, జూన్ 27 : మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాజన్న ఎడమకాలికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతుండగా.. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌ను అడిగి తెలుసుకొన్నారు.
- **పేకాట స్థావరంపై దాడి:** రుద్రూర్/మాక్లూర్, జూన్ 27: రుద్రూర్ జేఎన్‌సీ కాలనీలో ఓ పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 7910 స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.
  మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి శివారులో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.10,350, ఐదు మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.
- **పోతంగల్ తై బజార్ వేలం:** పోతంగల్, జూన్ 27: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ప్రత్యేకాధికారి, ఎంపీవో మారుతి అధ్యక్షతన గురువారం వేలం నిర్వహించారు. వార సంత రూ. 2.05 లక్షలకు గంగరాజు, మేకల సంత రూ.లక్షా80 వేలకు భూమయ్య, రోజువారీ సంత రూ.61వేలకు సాగర్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రకాంత్,కారోబార్ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.
- **గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం:** డిచ్‌పల్లి, జూన్ 27 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 సంవత్సరం 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రాంతీయ సమన్వయాధికారిణి అలివేలు తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి http://tgswadtr.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా జూలై 12 వరకులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
- **రేపు ఉద్యోగ మేళా:** కంఠేశ్వర్, జూన్ 27: నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 29న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీ సిరిమల్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహం లోపు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9581768413, 9948748428, 6305743423, 9959456793 నంబర్లను సంప్రదించాలని కోరారు.
- **బొజ్జా తారకం జయంతి:** ఖలీల్‌వాడి, జూన్ 27 : జిల్లా కేంద్రంలో మాలమహానాడు, ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం బొజ్జా తారకం జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పాపయ్య, రామ్మోహన్, సూర్య శివాజీ, నాగయ్య, ఖాజామొయినుద్దీన్, లింగం పాల్గొన్నారు.
- **గెస్ట్‌లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం-** మోర్తాడ్, జూన్ 27: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, కంప్యూటర్‌సైన్స్ అండ్ అప్లికేషన్స్ సబ్జెక్ట్‌లలో 2024-25 సంవత్సరానికి గాను బోధించుటకు గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పెద్దన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.
- **బాల్కొండలో..** బాల్కొండ, జూన్27: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి కోరారు. తెలుగు 1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 1, ఎకనామిక్స్ 1 ఖాళీలు న్నాయని తెలిపారు. జూలై 2లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పీజీలో55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్పులు ఉండాలని పేర్కొన్నారు.
- **మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్-** ఆర్మూర్‌టౌన్, జూన్27: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ధనవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ టీసీ, మెమో, ఎస్సెస్సీ మెమో, బోనాఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని కళాశాలకు రావాలని సూచించారు.
- **ఆహ్వాన పత్రిక అందజేత-**ఆర్మూర్‌టౌన్, జూన్27: పట్టణంలోని నవనాథ సిద్దేశ్వర గుట్టపై నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో నిర్వహించనున్న పత్రీజీ ధ్యాన మహా యజ్ఞంలో పాల్గొనాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యకు ఆహ్వాన పత్రాన్ని గురువారం నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ సభ్యులు అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 28, 29, 30 తేదీల్లో ధ్యాన యజ్ఞం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.
- **విద్యార్థులకు పుస్తకాల పంపిణీ-** ఆర్మూర్‌టౌన్, జూన్27: ఆర్మూర్ పట్టణంలోని జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపీకృష్ణ, సభ్యులు తులసి పట్వారి, పుష్కర్ రావు పాల్గొన్నారు.
- **బీటీరోడ్డుపై కేజ్‌వీల్ ట్రాక్టర్ నడిపితే జరిమానా-** రెంజల్, జూన్ 27: ఎక్కడైనా బీటీ, సీసీ రోడ్లపై పట్టీలు లేకుండా కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే జరిమానాలు విధించాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం తెలిపారు. రూ.5వేలు జరిమానా విధించాలని పేర్కొన్నారు.
- **నేడు సంతవేలం** నందిపేట్, జూన్ 27: 2024-25 సంవత్సరానికి గాను రోజువారి సంత వేలం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి గురువారం తెలిపారు. తైబజార్ (వారసంత)కు రూ.50 వేలు, రోజువారి సంతకు రూ.30వేలు మధ్యాహ్నం 2.30 గంటలలోగా డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు.
- **సన్మానం-** ఆర్మూర్‌టౌన్, జూన్27: చేపూర్‌లో బదిలీపై వెళ్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను వీడీసీ సభ్యులు గురువారం సన్మానించారు.
- **సుంకెట్ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక-** మోర్తాడ్, జూన్ 27: మండలంలోని సుంకెట్ గ్రామాభివృద్ధి కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొర్ర మల్లేశ్, నవీన్‌గౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం వారు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.
- **క్షీరాభిషేకం -** బోధన్, జూన్ 27: రూ. రెండు లక్షల రైతు రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.